ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
మంగళవారం 19 ఆగస్టు 2025




జైలులో పుస్తకాలు చదువుతున్న దర్శన్

బెంగళూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): హత్యకేసులో విచారణ ఖైదీగా పరప్పన అగ్రహార జైలుకు చేరిన నటుడు దర్శన్, పుస్తకాలు చదివేందుకు సిద్ధమయ్యారు. నాలుగురోజులుగా ఏకాంతంగా గడుపుతున్న దర్శన్, పలు పుస్తకాలను తన బ్యారక్‌లో ఉంచుకుని చదువుతున్నట్లు సమాచారం. సుప్రీంకోర్టులో బెయిల్ రద్దు కావడంతో దర్శన్‌ను గురువారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అదే రోజున అగ్రహార జైలుకు తరలించారు. రెండు రోజులుగా వెన్నునొప్పితో బాధపడుతుండటంతో జైలు ప్రాంగణంలోని ఆసుపత్రిలో చికిత్స అందించారు. గతంలో తరహాలోనే చికిత్స అందిస్తున్నట్లు సమాచారం.

సీఎంపై సిట్ వేస్తారా..?


డీసీఎం డీకే శివకుమార్


స్పీకర్ యూటీ ఖాదర్



సభలో ప్రసంగిస్తున్న ప్రతిపక్షనేత అశోక్

- 24 హత్య కేసులు ఉన్నాయటగా..?
- సభలో ప్రశ్నించిన ప్రతిపక్ష నేత అశోక్
- ధర్మస్థళ వివాదంపై సిట్ ఏమిటని విమర్శలు
- అధికార, ప్రతిపక్ష సభ్యుల వాగ్వాదాలతో అట్టుడికిన అసెంబ్లీ

బెంగళూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ధర్మస్థళ అంశంపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. సోమవారం అసెంబ్లీ ప్రారంభం కాగానే ధర్మస్థళ వివాదంపై ఎటువంటి నిర్ణయం తీసుకున్నారని ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నించారు. ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ ధర్మస్థళపై తరచూ ఆరోపణలు, విమర్శలు చేస్తూ వచ్చిన ఓ వ్యక్తి సీఎంపై 24 హత్యకేసులు ఉన్నాయని ఆరోపించిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ ఆరోపణలకు సిట్ ఏర్పాటు చేస్తారా..? అంటూ ప్రశ్నించారు. ఒక వ్యక్తి గౌరవమైన ముఖ్యమంత్రి హోదాలో ఉండే వారిపట్ల 24 హత్యకేసులు ఉన్నాయంటే ఇదో తీవ్రమైన ఆరోపణ అన్నారు. ప్రభుత్వం మౌనంగా ఉంటే కళ్లు, చెవులు లేనట్లే నన్నారు. సిట్ లేదా ఏ విధమైన విచారణ చేస్తారని నిలదీశారు. అంతలోనే బీజేపీ సభ్యుడు సునిల్‌కుమార్ మాట్లాడుతూ ఇదో తీవ్రమైన అంశమని, మౌనంగా ఉంటే అంగీకరించినట్లు అవుతుందని, సభలోనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మరో సభ్యుడు సురేశ్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిపై ధైర్యంగా ఆరోపణలు చేశారంటూ ప్రభుత్వం ఎలా సహిస్తుందని, ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. దేశంలోనే నెంబరువన్ హోం మంత్రిగా పేరొందిన పరమేశ్వర్ మౌనంగా ఉన్నట్లేనా..? అని నిలదీశారు. ఇదే సమయంలో డీసీఎం డీకే శివకుమార్ జోక్యం చేసుకుని సీఎంకు వ్యతిరేకంగా మాట్లాడిన వీడియో చూశానని, తన మొబైల్‌లోనూ ఉందన్నారు. అతడు సీఎం ఒక్కరిని ఉద్దేశించి మాట్లాడలేదని, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పేరు ప్రస్తావించారన్నారు.

సిట్ ఏర్పాటుకు ఒత్తిడి తెచ్చింది ఎవరు?

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర



ధర్మస్థళలో వందలాది మృతదేహాలు పాతిపెట్టానని ఓ వ్యక్తి ఆరోపణలు చేస్తే అతను ఎవరు, ఇంతకాలం ఎక్కడ ఉన్నారు. అతడి పూర్వాపరాలు ఏమిటనేది కనీసం తెలుసుకోకుండానే ప్రభుత్వం ఎందుకు ముందుకెళ్ళిందని బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర మండిపడ్డారు. సిట్ ఏర్పాటు చేసేది లేదని స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించి ఆ మరుసటి రోజే సిట్ ప్రకటించడం వెనుక ఒత్తిడి చేసింది ఎవరని తేలాలన్నారు.

వివాదంలో రాజీ ప్రసక్తే లేదు: హోం మంత్రి పరమేశ్వర్



ధర్మస్థళలో ఓ వ్యక్తి చెప్పాడని ప్రతిచోటా తవ్వేందుకు సాధ్యం కాదని ప్రస్తుతానికి మట్టి తవ్వకాలు మాత్రమే జరిగాయని హోం మంత్రి పరమేశ్వర్ బదులిచ్చారు. విచారణ ఇంకా పూర్తి కాలేదన్నారు. ఈ వివాదంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. ఫోరెన్సిక్ నివేదిక వచ్చాక వాటి ఆధారంగా సిట్ దర్యాప్తు కొనసాగిస్తుందన్నారు. నిబంధన 69 కింద సాగిన చర్చపై హోం మంత్రి వివరణ ఇచ్చారు. ఇప్పటివరకు 17 ప్రదేశాల్లో తవ్వకాలు జరిపారని, ఒక చోట అస్థిపంజరం, మరోచోట ఎముకలు మాత్రమే లభించాయన్నారు. ధర్మస్థళ అంశాన్ని దేశమంగా గమనిస్తోందన్నారు. అందుకు తగ్గట్టునే ప్రభుత్వం పకడ్బందీగా దర్యాప్తు జరుపుతోందన్నారు. ధర్మస్థళ ప్రాంతానికి 800ఏళ్ల చరిత్ర ఉందన్నారు. ఒక వ్యక్తి జూలై 3న ధర్మస్థళ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడన్నారు. ఈ ప్రాంతంలో హత్యకు గురైన మృతదేహాలను పూడ్చిపెట్టానని, పాపభీతి నుంచి బయటపడాలనే ఫిర్యాదు చేసనట్లు తెలుపుతాడన్నారు. ఆ తర్వాత ధర్మస్థళ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి తర్వాత మెజిస్ట్రేట్ ముందు హాజరు పరుస్తారన్నారు. మహిళా కమిషన్ చైర్మన్, సీఎంకు లేఖ రాసి సిట్ ఏర్పాటు చేయాలని కోరారన్నారు. ఈమేరకు జూలై 19న ఐపీఎస్ అధికారి ప్రణవ్‌మహంతి నేతృత్వంలో సిట్ ఏర్పడిందన్నారు. తొలుత అతడినుంచి వివరాలు సేకరించి, తర్వాత 13 పాయింట్లను గుర్తించి తవ్వకాలు జరుపుతారన్నారు. మట్టి తవ్వకాలు మాత్రమే సాగాయని, లభించిన కొన్ని ఆధారాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపామన్నారు. ప్రస్తుతానికి తవ్వకాలను సిట్ నిలిపివేసిందన్నారు. ఫోరెన్సిక్ నివేదిక వచ్చాక తదుపరి చర్యలు ఉంటాయన్నారు. సంఘటన జరిగిందని గానీ, లేదని గానీ ఇప్పటివరకు నిర్ధారించలేదని, దర్యాప్తు పూర్తయ్యాకే తెలుస్తుందన్నారు. సిట్ ఇప్పటివరకు మధ్యంతర నివేదిక ఇవ్వలేదన్నారు. అయితే త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని సిట్‌కు సూచించామన్నారు. ధర్మస్థళ ఆలయ ధర్మకర్త వీరేంద్రహెగ్డేపై ఆరోపణలకు సంబంధించి వాస్తవాలు రావాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఏదీ దాచిపెట్టడం లేదని, పైగా పారదర్శకంగా విచారణ సాగుతోందన్నారు. ఇందులో మరో ఉద్దేశ్యంగానీ, ఒత్తిడిగానీ లేదన్నారు. హోం మంత్రి వివరణకు ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముసుగుధారికి సంబంధించి ఏదైనా చెబుతారా..? అంటూ దాటవేశారంటూ ప్రతిపక్షనేత అశోక్ మండిపడ్డారు. పోలీస్‌స్టేషన్‌కు అతను తీసుకొచ్చిన పుర్రె ఎక్కడిదని, ఎలా తీసుకొచ్చారని ప్రశ్నించారు. అతడికి ప్రాణభయం ఉంటే ఎక్కడనుంచి తవ్వి పుర్రె తీసుకొచ్చారన్నారు. ధర్మస్థళ ప్రాంతంలో తవ్వకాలకు అనుమతులు తీసుకున్నారా..? సిట్ ఏర్పాటు చేయాలని కోర్టు ఆదేశించిందా..? అంటూ ప్రశ్నించారు. కాగా కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడుతూ హర్షేంద్ర హెగ్డే, సీఎంను కలసి సిట్ ఏర్పాటుపై అభినందించారన్నారు. అంతలోనే డీసీఎం డీకే శివకుమార్ జోక్యం చేసుకుని ఏటా సీఎం ధర్మస్థళకు వెళ్తారని, ఆరోగ్య పరీక్షలు జరిపించుకుంటారన్నారు. కానీ రాజకీయాలలో మతం ఉండవచ్చునని, కానీ మతమే రాజకీయం కారాదన్నారు. నిర్దాక్షిణ్యంగా ఎవరినీ బలి తీసుకోమని, నాలుగైదురోజులు వేచి ఉండాలన్నారు. బీజేపీ సభ్యుడు సునిల్‌కుమార్ జోక్యం చేసుకుని ధర్మస్థళ వివాదంపై సిట్ ఏర్పాటుకు ఎవరూ అభ్యంతరం తెలపలేదని, కానీ యూట్యూబర్‌ల దుష్ప్రచారం జరిగిందన్నారు. దాన్ని ఎందుకు నియంత్రించలేదన్నారు. ఈ వివాదం వెనుక ఒక ముసుగుదారి కాదని, పదులసంఖ్యలో ముసుగులు వేసుకుని పనిచేస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకే సిట్ ఏర్పాటు చేశారన్నారు. దీంతో అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. స్పీకర్ జోక్యం చేసుకుని ప్రభుత్వమే కుట్ర పన్నిందనే వ్యాఖ్యలను తొలగించాలన్నారు. అయితే సునిల్‌కుమార్ మాత్రం దుష్ప్రచారానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని మరోసారి ఆరోపించారు. ముసుగుదారుడికి నిజనిర్ధారణ పరీక్షలు జరిపించాలని బీజేపీ సభ్యుడు కిశోర్‌కుమార్ రై డిమాండ్ చేశారు.

సమన్ల విషయంలో మహేశ్ తిమరోడి అభ్యంతరం

ధర్మస్థళ వివాదంలో సూత్రధారిగా ఉంటూ ముఖ్యమంత్రిపై హత్య ఆరోపణలు చేసిన మేరకు మహేశ్‌శెట్టి తిమరోడికి సోమవారం సాయంత్రం సమన్లు ఇచ్చేందుకు వెళ్లినవారిపై అనుచరులు తిరగబడ్డారు. ఇంజక్షన్ ఆర్డర్ తీసుకుని మాట్లాడాలన్నారు. బెంగళూరు ట్రయల్ కోర్టు జారీ చేసిన హ్యాండ్ సమన్లను తీసుకోకుండా అభ్యంతరం తెలిపారు. కాగా ఈ వివాదానికి కారకులైన మట్టణ్ణనవర్, మృతదేహాల విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేసిన జయంత్, ధనుష్‌శెట్టి తదితరులు ఉన్నారు. పోలీసులు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

హెబ్బాళ్ ఫ్లై ఓవర్‌తో తగ్గనున్న దూరం

- ఎయిర్‌పోర్ట్, కేఆర్ పురం దారుల్లో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం : సీఎం

బెంగళూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): హెబ్బాళ్ ఫ్లై ఓవర్ కీలకమైనదని, దీంతో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టినట్లు అవుతుందని, ఇటు ఎయిర్‌పోర్ట్, అటు కేఆర్ పురం నుంచి వచ్చే వేలాది వాహనాలకు ఇదే ప్రధాన మార్గనమి సీఎం సిద్దరామయ్య అన్నారు. కేఆర్ పుర నుంచి వచ్చే వాహనాలకు అనుకూలంగా హెబ్బాళ ఫ్లై ఓవర్‌పై నిర్మించిన మార్గాన్ని సోమవారం సీఎం ప్రారంభించారు. డీసీఎం డీకే శివకుమార్, నగర పాలకశాఖ మంత్రి భైరతి సురేశ్, రెవెన్యూశాఖ మంత్రి కృష్ణభైరేగౌడ, బీడీఏ చైర్మన్ హ్యారిస్ పాల్గొన్నారు. డీసీఎం డీకే శివకుమార్ కొత్త ఫ్లై ఓవర్‌పై బుల్లెట్‌పై చక్కర్లు కొట్టి ఆకర్షించారు.


ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ తదితరులు


ముస్తాబైన ఫ్లైఓవర్


మొదలైన వాహన సంచారం

అనూహ్యంగా తెరపైకి రమ్య

కొన్నేళ్లకాలంగా కాంగ్రెస్ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చిన మండ్య మాజీ ఎంపీ రమ్య తెరపైకి వచ్చారు. హెబ్బాళ్ ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. వేదికపై సీఎం, డీసీఎంలతో కనిపించారు. బయల్దేరే ముందు సీఎం సిద్ధరామయ్యకు షేక్ హ్యాండ్ ఇచ్చి వెళ్లారు. కొన్నేళ్లకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చిన రమ్య పాల్గొనడం సర్వత్రా ఆసక్తికరంగా మారింది



వేదికపై రమ్య

మాజీ సైనికులకు అండగా

- సమస్యల పరిష్కారానికి చర్యలు
- పలు ప్రాంతాల్లో కుటుంబ సభ్యుల ఫిర్యాదులపై స్పందించిన ఉపలోకాయుక్త
- రాష్ట్ర వ్యాప్తంగా సమాచార సేకరణకు నిర్ణయం

బెంగళూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దులో భద్రతకోసం ఎండ, చలి, వాన లెక్కించక సేవలందించి అశువులు బాసిన మాజీ సైనికుల కుటుంబీకుల సమస్యలను పరిష్కరించేందుకు ఉపలోకాయుక్త చొరవ చూపారు. ఆర్మీలో రిటైరైన వారికి, విధి నిర్వహణలో లేదా మరేదైనా కారణాలతో మృతి చెందినవారి కుటుంబీకులు అందాల్సిన ప్రభుత్వ సౌకర్యాలు సకాలంలో అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. మృతుల కుటుంబీకులు కార్యాలయాల చుట్టూ తిరుగుతుండడాన్ని ఉపలోకాయుక్త విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారుల అలసత్వం, జాప్యం వంటి కారణాలతో మాజీ సైనికుల కుటుంబాలకు తగిన సౌలభ్యాలు అందడం లేదని గుర్తించారు. కొంతమంది హైకోర్టు లేదా లోకాయుక్తను ఆశ్రయించడం అధికమైన నేపథ్యంలో ఉపలోకాయుక్త స్పందించారు. తద్వారా 31 జిల్లాల్లోనూ తాలూకా స్థాయి నుంచి పరిష్కారం చూపేలా తహసీల్దార్‌ల నుంచి వివరాలు సేకరించదలిచారు.


ఉపలోకాయుక్త వీరప్ప



ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఉపలోకాయుక్తలు బీ వీరప్ప, కేఎన్ ఫణీంద్రలు రాష్ట్రంలోని 31 జిల్లాల్లో స్వచ్ఛందంగా ఫిర్యాదులను పరిశీలించనున్నారు. మాజీ సైనికులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థ నుంచి విముక్తి చేయాలని నిర్ణయించారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యాచరణకు సిద్ధమయ్యారు. తొలుత తమ వద్ద పెండింగ్‌లో ఉన్న అర్జీలను పరిష్కరించేలా తహసీల్దార్‌లకు మార్గదర్శకం చేయాలని నిర్ణయించారు.

- మాజీ సైనికుల కుటుంబీకులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారనేందుకు ఉదాహరణగా మండ్య జిల్లాలో మాజీ సైనికుడి భార్య బీసీ గీతా రెండు దశాబ్దాలుగా భర్త మరణానంతరం రావాల్సిన ప్రభుత్వ ప్రయోజనాలు అందలేదని ఉపలోకాయుక్త ప్రస్తావించారు. తుమకూరులో స్వాతంత్ర్యపోరాట నేత విరూపాక్ష మృతి చెందడంతో ఆయనకు లభించాల్సిన భూమి కోసం లలితాంబికా గత ఐదు దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కుటుంబీకులకు అండగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉపలోకాయుక్త అభిప్రాయపడ్డారు.
- 15 జిల్లాల్లో ఇన్‌చార్జ్‌గా వ్యవహరించే ఉపలోకాయుక్త న్యాయమూర్తి ఫణీంద్ర, 16 జిల్లాలకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించే న్యాయమూర్తి బీ వీరప్పలు సంయుక్తంగా మంగళవారం అన్ని జల్లాల లోకాయుక్త కార్యాలయాల్లో స్వచ్ఛందంగా కార్యాలయాలలో ఫిర్యాదులు నమోదు చేసుకున్నారు. ఆ ఫిర్యాదుల్లో జిల్లా అధికారులు, ఆయా జిల్లాల తహసీల్దార్‌లను ప్రతివాదులుగా చేర్చారు.


న్యాయమూర్తి ఫణీంద్ర

సరిహద్దులో సైనికులు కాపలాగా ఉండడంతో మనం సురక్షితంగా ఉన్నాము. చట్టరీత్యా వారికి కొన్ని ప్రయోజనాలు కల్పించేందుకు అవకాశం ఉంది. మరణానంతరం లేదా, రిటైరైన తర్వాత పరిస్థితులకు అనుగుణంగా వారి కుటుంబ సభ్యులకు భూమి లేదా స్థలం ఇవ్వాల్సి ఉంది. కర్ణాటక లోకాయుక్త చట్టం సమగ్రంగా అమలు కావాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. సెప్టెంబరు 24లోగా తహసీల్దార్‌లు తమ పరిధిలోని అంశాలను వివరాలు సమర్పించే బాధ్యత జిల్లా సహాయక కమిషనర్ పర్యవేక్షిస్తారని సూచించారు.

ఎలాంటి వివరాలు సేకరించదలిచారంటే..

- విధి నిర్వహణలో ఎంతమంది మృతి చెందారు.
- ఎంతమందికి పరిహారం, ప్రయోజనాలు అందాయి?
- వారిలో ఎంతమందికి భూమి లేదా స్థలం కేటాయించారు?
- ఎన్ని అర్జీలు వచ్చాయి, ఆమోదం పొందినవి ఎన్ని; ఇంకా పెండింగ్‌లో ఎన్ని ఉన్నాయి.
- ఎలాంటి ప్రయోజనాలు పొందారనేది తహసీల్దార్‌లు వివరాలు సమర్పించాల్సి ఉంటుంది.




బైక్ ర్యాలీలో హిందూ జాగరణ వేదిక, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు

పదివేల బైక్‌లతో ర్యాలీ

- బళ్లారిలో ఘనంగా హనుమాన్ జాగృతి యాత్ర

8


డ్యాం నుంచి నదిలోకి విడుదలవుతున్న నీరు

ఉధృతంగా తుంగభద్ర

శ్రీసత్యసాయి జిల్లాలో ఘోర ప్రమాదం

- టెంపో ట్రావెలర్స్.. ఆర్టీసీ బస్సు ఢీ
- నలుగురి మృతి.. పది మందికి గాయాలు
- బాధితులు బళ్లారివాసులు


ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

తనకల్లు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం మండ్లిపల్లి వద్ద రెండు టెంపో ట్రావెలర్‌లు, ఆర్టీసీ బస్సు సోమవారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కర్ణాటకలోని బళ్లారి జిల్లా కేంద్రానికి చెందిన అనసూయమ్మ (50), జాహ్నవి(4), డ్రైవర్ మణికంఠ(42), నాగేంద్రప్ప (58) మృతిచెందారు. మరో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయిస్తున్నారు. ఎస్‌ఐ గోపీ తెలిపిన మేరకు, బళ్లారికి చెందిన 13 మంది టెంపో ట్రావెల్ వాహనంలో అరుణాచలం, తిరుమల-తిరుపతి క్షేత్ర సందర్శనకు వెళ్లారు. దైవ దర్శనం అనంతరం సోమవారం తిరుగు ప్రయాణమయ్యారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం తనకల్లు మండలం మండ్లిపల్లి వద్ద ముందు వెళ్తున్న మరో టెంపో ట్రావెల్‌ను ఓవర్‌టేక్ చేయబోయింది. అదే సమయంలో కదిరి నుంచి మదనపల్లికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చింది. దీంతో ఘోర ప్రమాదం జరిగింది. ఎదురుగా రెండు టెంపో ట్రావెలర్‌లు వేగంగా రావడంతో ఆర్టీసీ బస్సుకు మార్గం లేకపోయింది. ఈ క్రమంలో మూడు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బళ్లారివాసులు ప్రయాణిస్తున్న వాహనంలోని వారు మాత్రమే మృతిచెందారు, గాయపడ్డారు. ఆర్టీసీ బస్సు, మరో టెంపో ట్రావెలర్‌లో ఉన్నవారు సురక్షితంగా బయట పడ్డారు. బళ్లారికి చెందిన అనసూయమ్మ ప్రమాద స్థలంలోనే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన 13 మందిని తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కదిరిలో జాహ్నవి, అనంతపురం తరలిస్తుండగా మణికంఠ, బళ్లారికి తరలిస్తుండగా నాగేంద్రప్ప మృతిచెందారు. నాగార్జున, కుమార్‌స్వామి, రుత్విక, బీజీ కుమార్ స్వామి, భార్గవి, గోవిందమ్మ, గోవిందప్ప, రాకేష్, చిన్నమ్మ, ఆంజనమ్మ కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాద స్థలాన్ని పోలీసులు సందర్శించారు. రోడ్డుపై మూడు వాహనాలు ఢీకొట్టడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు ఎక్స్‌కవేటర్ల సాయంతో వాహనాలను పక్కకు తొలగించి, రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూశారు.


ఆస్పత్రిలో క్షతగాత్రుడు

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో యువరైతు మృతి


సందీప్‌రెడ్డి (ఫైల్)

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటంపల్లిలో సోమవారం విద్యుదాఘాతానికి గురై ఓ యువరైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రత్నమ్మ, చంద్రారెడ్డి దంపతుల రెండో కుమారుడు మైలారపు సందీప్‌రెడ్డి(36) అనే యువ రైతు తన వ్యవసాయ తోటలో పంటకు నీరు పెట్టడానికి వెళ్లాడు. స్టార్టర్ పెట్టె వద్దకు వెళ్లి మోటారు ఆన్‌చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మౌనిక, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంఘటనా స్థలం వద్ద విగతజీవిగా పడి ఉన్న సందీప్‌రెడ్డి మృతదేహంపై పడి భార్య మౌనిక, తల్లి రత్నమ్మ రోదించిన తీరు అక్కడున్న వారిని కంట తడి పెట్టించింది. ఘటనతో వెంకటంపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

లేపాక్షి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో చేనేత కార్మికుడు లక్ష్మీపతి(32) సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన మేరకు బయన్నపల్లి గ్రామానికి చెందిన ఆదెప్ప కుమారుడు లక్ష్మీపతి గత కొన్నేళ్లుగా లేపాక్షిలో సొంత ఇల్లు నిర్మించుకుని చేనేత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. ఇతడు గత కొన్నేళ్ల నుంచి తీవ్రమైన తలనొప్పితో బాధపడుతుండేవాడు. ఎన్ని ఆసుపత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో తీవ్రంగా మనస్తాపం చెందాడు. ఈక్రమంలోనే జీవితంపై విరక్తి చెంది సోమవారం తెల్లవారుజామున ఇంట్లో భార్య నిద్రిస్తుండగా హాల్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కాసేపటి తర్వాత నిద్ర లేచిన భార్య ఉరికి వేలాడుతున్న భర్తను చూసి గట్టిగా కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కలవారు అక్కడకు వచ్చి ఉరికి వేలాడుతున్న లక్ష్మీపతిని కిందికి దించి పరిశీలించి, మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి నాలుగు నెలల కుమార్తె ఉంది. మృతుడి తండ్రి ఆదెప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పరిశ్రమలో కార్మికుడి మృతి

హిందూపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గోళ్లాపురం పారిశ్రామికవాడలోని ఓ స్టీల్ పరిశ్రమలో కార్మికుడు దుర్మరణం చెందాడు. శంభుపాశ్వా(40)అనే కార్మికుడు విధుల్లో ఉండగా సోమవారం ప్రమాదవశాత్తు ఐరన్ పరాడ్ శరీరంలో దూరింది. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పరిశ్రమ యాజమాన్యం ఈ ప్రమాదంపై గోప్యంగా ఉంచింది. దీనిపై అప్రిగేడ్ సీఐ ఆంజనేయులును వివరణ కోరగా.. ప్రమాదం జరిగి కార్మికుడు మృతిచెందాడని, దీనిపై దర్యాప్తు చేయాల్సి ఉందన్నారు.


ఓ తుంటరి తూనీగా..! నీకే రెక్కలున్నట్లు..! ఎక్కడెక్కడో తిరిగి.. అలసి ఇక్కడికి వచ్చావు ? ఏముందని ఎండిన కొమ్మపై వాలావు

చిత్రం.. సిత్రం..!


రంగు రెక్కల సీతాకోక చిలుకా మకరందపు మాధుర్యం చూడగ వచ్చావా..! మా ఇంటిదాకా..


సూడు సూడు ఈయప్ప నేనొగదాన్ని ఉండానని కూడా పట్టించుకోకుండా సిక్కింది మిడతని గబగబా గొంతులోకి ఏసుకుంటాడు..!


థూ..యాల్రా నాదాంట్లోకి వచ్చిండావు అద యాడా పెట్టేదా బువ్వ.. ఈటికొచ్చినావు సిత్రాన్నం కమ్మగుంది నేనొగడే తిన్నర్ల.. పోలే అక్కడ

జ్ఞాపకాల దొంతర ఫోటో.. మది చెదిరిన బాధలు, బంధాలు, ఆనందాలు, అద్భుతాలు వినోదాలు, విషాదాలు గుర్తు చేసే సజీవ సాక్ష్యం ఫోటో తీసి చేదుల మాధుర్యాన్ని మనసు పొరలకు అందిస్తూ కాలగమనాన్ని కాసేపు ఆపే 'చిత్రం' అది కాలం మారినా కరిగిపోని వసంతాన్ని చిగురించిన చైత్రంలా మనసును బంధించే చిత్రపు నిత్యనూతనం

నేడు వరల్డ్ ఫొటోగ్రఫీ డే


ఏమన్నా.. ఇన్నాళ్లకు మనుసుకొస్తినా..? ఓహో మంగళవారం ఫొటోగ్రఫీ డే కదా.. అందుకే మతికివచ్చుంటా సర్‌సర్లే ఫొటో మట్టంగ తియ్.. పిల్ల మామా అనల్ల

ఫొటోలు: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్

రోజంతా హై టెన్షన్..

- తాడిపత్రికి బయల్దేరిన పెద్దారెడ్డి
- మధ్యలోనే అడ్డుకున్న పోలీసులు
- వెనక్కి వెళ్లాలని సూచన
- ససేమిరా అన్న మాజీ ఎమ్మెల్యే
- ఆరుగంటల పాటు రోడ్డుపైనే బైఠాయింపు
- ఎట్టకేలకు వెనక్కి పంపించిన పోలీసులు


డీఎస్పీతో పెద్దారెడ్డి వాగ్వాదం

తాడిపత్రి/పుట్లూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి నియోజకవర్గంలో రోజంతా హైటెన్షన్ నడిచింది. తాడిపత్రికి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సోమవారం బయల్దేరడంతో పట్టణ వాసుల్లో ఆందోళన నెలకొంది. పట్టణంలో ధ్యానశివుడి విగ్రహావిష్కరణ మున్సిపల్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు భారీ సంఖ్యలో గుమికూడారు. అదే సమయంలో పెద్దారెడ్డి పట్టణానికి వస్తుండడంతో ఎప్పుడు, ఏం జరుగుతుందో నని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. దారి మధ్యలోనే పెద్దారెడ్డిని పోలీసులు అడ్డుకోవడంతో ఆయన అక్కడే ఆరుగంటలపాటు బైఠాయించారు. ఎట్టకేలకు సాయంత్రం ఆయనను పోలీసులు వెనక్కి పంపించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఎన్నికల సమయం నుంచి..

గతేడాది ఎన్నికల సమయం నుంచి పెద్దారెడ్డి తాడిపత్రికి దూరంగా ఉంటున్నారు. ఆయనను రానివ్వమని జేసీ ప్రభాకర్ రెడ్డి వర్గీయులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పెద్దారెడ్డి పలుమార్లు తాడిపత్రికి రావాలని ప్రయత్నించినా.. శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని పోలీసులు అడ్డుకుంటూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో పెద్దారెడ్డి.. హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు సోమవారం మరోసారి తాడిపత్రికి వెళ్తున్నట్లు ప్రకటించారు. ఇదేరోజే జేసీ ప్రభాకర్ రెడ్డి పట్టణంలోని అనంతపురం రోడ్డులోని ఫ్లైఓవర్ సమీపాన ధ్యానశివుడి విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఇందుకు వేలాదిగా టీడీపీ శ్రేణులు, ఆయన అనుచరులు హాజరయ్యారు.

అడ్డుకున్న పోలీసులు

పెద్దారెడ్డి యల్లనూరు మండలంలోని స్వగ్రామం తిమ్మంపల్లి నుంచి తాడిపత్రికి అనుచరులతో కలిసి బయల్దేరారు. శాంతిభద్రత సమస్య తలెత్తే అవకాశం ఉండడంతో పుట్లూరు మండలంలోని నారాయణరెడ్డి పల్లి వద్ద పెద్దారెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందనీ, తాడిపత్రికి అనుమతించబోమని చెప్పారు. కోర్టు అనుమతితో వెళ్తున్నాననీ, అడ్డుకోవడం ఏమిటంటూ పోలీసులతో పెద్దారెడ్డి వాగ్వాదం చేశాడు. అక్కడే రోడ్డుపై బైఠాయించారు. ఆరుగంటలపాటు అక్కడే ఉన్నారు. సాయంత్రం 6గంటల సమయంలో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తిమ్మంపల్లికి వెళ్లిపోవాలని సూచించారు. దీంతో చేసేదిలేక పెద్దారెడ్డి వెనుదిరిగారు. దీంతో తాడిపత్రి వాసులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

కోర్టు ఆర్డర్ ఉన్నా.. అడ్డుకుంటారా..?

మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పోలీసులే స్వయంగా తనను తాడిపత్రిలోని ఇంటికి చేర్చాలని హైకోర్టు ఆదేశించింది.. వారే అడ్డుకోవడం ఏంటని మండిపడ్డారు. 16నెలలుగా తనను తాడిపత్రికి వెళ్లనీయలేదన్నారు. 'నా ఇంటికి వెళ్లడానికి నేనేమైనా వేరే దేశంలో ఉన్నానా? వీసా ఏమైనా తీసుకోవాలా' అంటూ పోలీసులను నిలదీశారు. మళ్లీ కోర్టుకు వెళ్తానన్నారు. అడ్డుకున్న అధికారులు, కక్ష సాధిస్తున్న వారిని వదిలిపెట్టమని హెచ్చరించారు. పెద్దారెడ్డిని కలవడానికి వచ్చిన మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ.. తాడిపత్రిలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్యేను తన ఇంటికి వెళ్లనీయకుండా అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. ఆయనను పోలీసులు బలవంతంగా జీపులో ఎక్కించి పంపించారు.


పెద్దారెడ్డి కాన్వాయ్‌ను అడ్డుకున్న పోలీసులు

అక్రమ మైనింగ్‌పై తనిఖీలు

యాడికి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని దైవాలమడుగు వద్ద ఒక గనిలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై సోమవారం కర్నూలు జిల్లాకు చెందిన విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. మైనింగ్‌లో జరుగుతున్న అక్రమాలపై నిగ్గు తేల్చడానికి తాడిపత్రి మైన్స్ అండ్ జియాలజీ అధికారులను సంప్రదించినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. రాయలచెరువు గ్రామానికి చెందిన ఒక పారిశ్రామిక వేత్తకు మండలంలోని దైవాలమడుగు గ్రామం వద్ద డోలమైట్ గని ఉంది. ఇందులో ఖనిజం తవ్వకాలకు సంబంధించి సీఎస్ఐ, మేఏసీఈ కాంపరమైన ఏదైనా క్రితం ముగిసినట్లు తెలిసింది. కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద విజిలెన్స్ అధికారులు తనిఖీ బయటపడినట్లు తెలిసింది. దీనిపై నిగ్గుతేల్చడానికి సోమవారం కర్నూలు నుంచి విజిలెన్స్ అధికారులు వచ్చారని తెలిసింది. వర్షం పడుతుండడంతో మైనింగ్ ప్రాంతం వద్ద నుంచి అధికారులు వెనక్కి వచ్చినట్లు తెలిసింది.


నీటితో కళకళలాడుతున్న పీఏబీఆర్ డ్యాం

పీఏబీఆర్‌కు జలకళ

- డ్యాంలో నాలుగు టీఎంసీల నిల్వ

కూడేరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్ డ్యాం) నీటితో కళకళలాడుతుంది. ప్రస్తుతం డ్యాంలో నాలుగు టీఎంసీల నీటి నిల్వ ఉంది. డ్యాంలో నీటి మట్టం గేట్ల వద్దకు చేరడంతో ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్, డీఈ వెంకటరమణ సోమవారం పరిశీలించారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పీఏబీఆర్ డ్యాంలోకి 1672 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉందని డీఈ వెంకటరమణ తెలిపారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా ఫేజ్-2 కాలువకు అధికారులు నీరు వదలడంతో, పీఏబీఆర్ డ్యాంకు వస్తున్న నీరు తగ్గుముఖం పట్టింది. గతంలో 1860 క్యూసెక్కుల నీరు వస్తుండగా, సోమవారం 1672 క్యూసెక్కులకు తగ్గింది. మరో వారం రోజులకు పూర్తిగా తగ్గిపోతుందని అధికారులు తెలిపారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి నీరు తగ్గిపోతే తుంగభద్ర డ్యాం నుంచి వస్తున్న నీటిని లింక్ చానల్ ద్వారా పీఏబీఆర్ డ్యాంలోకి మళ్లించి ఐదు టీఎంసీలు నిల్వ చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో పోలీసుల తనిఖీ


డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు

అనంతపురం క్రైం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, మత్తుపదార్థాల రవాణా నియంత్రణ కోసం పోలీసులు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్(18463) రైలులో సోమవారం తనిఖీలు నిర్వహించారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్, స్థానిక పోలీసులు, డాగ్ స్క్వాడ్, ఈగల్ సెల్ పోలీసులు తనిఖీ చేశారు. అనంతపురం నుంచి ధర్మవరం వరకు ప్రయాణిస్తున్న వారి లగేజీ, టికెట్లు పరిశీలించారు. అనుమానాస్పదంగా కనిపించిన ప్రయాణికుల వివరాలు అడిగి తెలుసుకుని, లగేజీని తనిఖీ చేశారు. డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాలు రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈగల్ సెల్ ఎస్ఐ హనుమంతు, జీఆర్పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఆర్పీఎఫ్ సీఐ సుధాకర్‌రావు, డాగ్ స్క్వాడ్ చాంద్ బాషా పాల్గొన్నారు.

టీచర్ల ఖాళీల వివరాల సేకరణ

అనంతపురం విద్య, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నియామకాలలో భాగంగా ఖాళీ పోస్టుల వివరాలను విద్యాశాఖ పక్కాగా సేకరిస్తోంది. ఆయా మండలాలు, పాఠశాలలో ఏఏ సబ్జెక్టులు, ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి, ఐటీఏల బదిలీ మేరకు రిలీవర్ లేక అదే పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లు, ఒక్క టీచర్ లేని పాఠశాలలు, సబ్జెక్టు టీచర్లు లేని ఉన్నత పాఠశాలల సమాచారాన్ని సేకరించింది. వీటి వివరాలను పక్కాగా అందించాలని ఆయా మండలాల ఎంఈఓలు, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలను ఉదయం అనంతపురం డివిజన్, మధ్యాహ్నం గుత్తి డివిజన్ల వారిగా జిల్లా సైన్స్‌సెంటర్‌కు ఆహ్వానించారు. అక్కడ డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, ఏపీఓ శ్రీనివాసులు, ఏడీలు మంజునాథ్, ఐటీ సెల్ చంద్రశేఖరరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి ఎంఈఓలు,హెచ్ఎంల నుంచి టీచర్ల ఖాళీల వివరాలను స్వీకరించారు. అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో ఖాళీల వివరాలు నమోదు చేయిస్తూ ఉన్న పోస్టులకు.. ఎంఈఓలు, హెచ్ఎంలు ఇచ్చిన వివరాలు సరిపోయాయా లేదా అని పరిశీలిస్తున్నారు. డీఎస్సీ నియామకాలకు ఖాళీల వివాదం తలెత్తకుండా విద్యాశాఖ ముందస్తు చర్యలు తీసుకుంటోంది.

బాధ్యతల స్వీకరణ

అనంతపురం విద్య ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష సూపరింటెండెంట్‌గా కృష్ణారావు బాధ్యతలు స్వీకరించారు. చేతి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న కారణంతో ఇదివరకు ఉన్న సూపరింటెండెంట్ ఇక్బాల్‌మహ్మద్‌ను ఏపీసీ శైలజ ఐటీఏల ప్రభుత్వానికి సరెండర్ చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో చిత్తూరు జిల్లా సమగ్రశిక్షలో పని చేస్తున్న కృష్ణారావును అనంతపురం జిల్లాకు నియమిస్తూ ఆర్జేడీ శామ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. కొత్త సూపరింటెండెంట్‌కు సమగ్రశిక్షలో పనిచేస్తున్న సిబ్బంది అభినందనలు తెలిపారు.

30 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 30 మండలాల్లో ఆదివారం వర్షం కురిసింది. అత్యధికంగా కుందుర్పిలో 19.6 మి.మీ వర్షపాతం నమోదైంది. డి. హీరేహాళ్, తాడిపత్రిలో 15.2, బెళుగుప్ప 13.8, బొమ్మనహాళ్ 10.6, రాయదుర్గం 10.2, కంబదూరు 9.2, పెద్దవడుగూరు 8.8, గార్లదిన్నె 8.6, గుత్తి, యాడికి 8.2, కణ్ణేకల్లు... కళ్యాణదుర్గం 8.0, శింగనమల 7.2, విడపనకల్లు, యల్లనూరు 6.8, నార్పల 6.4, ఉరవకొండ 6.2, బ్రహ్మసముద్రం 6.0 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతామండలాల్లో 5.6 మి.మీలోపు వర్షపాతం నమోదైంది. సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం పడింది. అనంతపురం,యాడికి, పుట్లూరు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

టమోటా కిలో రూ.47

అనంతపురం రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో సోమవారం కిలో టమోటాలు గరిష్ఠంగా రూ.47తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.27తో, సరాసరి ధర రూ.37తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,850 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఓటరు భద్రతే కాంగ్రెస్ కర్తవ్యం

- రాహుల్‌కు మద్దతుగా యావత్‌దేశం
- డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి


ఓట్ చోర్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అనంతపురం వైద్యం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు చోరీ కాకుండా ఓటరుకు భద్రత కల్పించడమే కాంగ్రెస్ కర్తవ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఓట్ చోర్ - గద్దీ ఛోడ్ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని క్లాక్‌టవర్ నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు సాగిన ర్యాలీకి మధుసూదన్‌రెడ్డితో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాకే శివశంకర్, మైనార్టీ విభాగాధ్యక్షుడు దాదాగాంధీ, కార్యదర్శి యం.ఎం.డి ఇమామ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మధుసూదనరెడ్డి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఓట్ల గల్లంతు జరుగుతోందన్నారు. దేశప్రజలంతా రాహుల్ గాంధీకి మద్దతుగా నిలవడంతో అధికార బీజేపీకి కలవరింపు మొదలయిందన్నారు. ఓట్ చోర్ లెక్కలు తేల్చేందుకు రాహుల్ గాంధీకి దేశప్రజల మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణరెడ్డి, పోసినేన, అబ్బాస్, ప్రసాద్‌రెడ్డి, కృష్ణ, అహ్మద్, నరసింహారెడ్డి, పోలన్న, రామాంజనేయులు, మొహిద్దీన్, బొజ్జప్ప, ఈశ్వర్‌ప్రసాద్, ఓబులేసు, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాత్రి 12 వరకూ బార్లు

- 1 నుంచి కొత్త బార్ పాలసీ
- ఉమ్మడి జిల్లాలో 30 బార్లకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 26 వరకు గడువు
- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య



అనంతపురం క్రైం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కొత్త బార్ పాలసీ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అమలవుతుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉమ్మడి అనంతపురం జిల్లా డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య పేర్కొన్నారు. సోమవారం అనంతపురంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, ఇతర అధికారులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ నాగమద్దయ్య మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం 2025-2028 సంవత్సరాలకు కొత్త బార్ పాలసీ తీసుకొచ్చిందన్నారు. ఆ మేరకు బార్ల లైసెన్సుల కోసం సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. అనంతపురం జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్‌లో 9 బార్లు, గుంతకల్లులో 3, తాడిపత్రిలో 4, రాయదుర్గం, గుత్తి, కళ్యాణదుర్గంలో ఒకటి చొప్పున బార్లు ఉన్నాయని, సత్యసాయి జిల్లాలో హిందూపురంలో 3, ధర్మవరంలో 3, కదిరిలో 3, పెనుకొండ, మడకశిరలో ఒకటి చొప్పున ఉన్నాయని వివరించారు. మొత్తం 30 బార్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. గతంలో బార్లను వేలం ద్వారా కేటాయించే వారని, ప్రస్తుతం లాటరీ ద్వారా విధానంలో కేటాయిస్తామని అన్నారు. 2022-25 బార్ పాలసీలో జనాభా స్లాబ్ మేరకు బార్లకు దరఖాస్తు ఫీజు రూ. 5 లక్షలు, రూ.7.5 లక్షలు, రూ. 10 లక్షలు ఉండేదన్నారు. కొత్త విధానంలో దరఖాస్తు ఫీజు అన్నింటికీ రూ. 5 లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు రూ.10వేలు నిర్ణయించినట్లు తెలిపారు. పారదర్శకంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రతి బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు రావాలన్న షరతును ప్రభుత్వం విధించిందన్నారు. 50 వేలలోపు జనాభా ఉన్న బార్లకు లైసెన్స్ ఫీజు రూ. 35 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల జనాభా ఉన్న బార్లకు రూ. 55 లక్షలు, 5 లక్షల పైబడిన జనాభా ఉన్న బార్లకు రూ. 75 లక్షల ఫీజును ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. గతంలో ఉన్న ఫీజుతో పోలిస్తే భారీగా తగ్గించారని అన్నారు. కొత్త బార్ల నిర్వహణ సమయాన్ని కూడా పెంచారన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ నడపవచ్చు అన్నారు. లైసెన్సు ఫీజును ఆరు వాయిదాల్లో చెల్లించవచ్చునని తెలిపారు. గతంలో ముందే రెస్టారెంట్ తప్పనిసరిగా ఉండాలనే నిబంధన ఉండేదని, కొత్త విధానంలో లైసెన్సు వచ్చిన 15 రోజుల వరకు గడువు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో వేయవచ్చు అన్నారు. దరఖాస్తులను రెండు జిల్లాల్లోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయాల్లో అందజేయాలన్నారు. 28వ తేదీ లాటరీ ద్వారా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అనంతపురం సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులు ఛిద్రం

- చిన్నపాటి వానకే బురదమయం

గుత్తిరూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామీణ రహదారులు హోరంగా తయారయ్యాయి. తొండపాడు నుంచి గొందిపల్లికి వెళ్లే రోడ్డు చిన్నపాటి వర్షానికే చాలు.. మొత్తం బురదమయంగా మారుతోంది. పది రోజుల నుంచి వర్షం పడుతుండంతో ప్రస్తుతం మరీ ఘోరంగా తయారైంది. తొండపాడు నుంచి గొందిపల్లికి 2019లో బీటీ రోడ్డు వేసినా.. మధ్యలో కిలో మీటరు మేరకు మట్టి రోడ్డునే అలాగే వదిలేశారు. ఈ దారి గుండా గొందిపల్లి, నంద్యాల జిల్లా మామిళ్లపల్లి, రాంపురం, జక్కసానికుంట్ల, పీఆర్ పల్లికి ద్విచక్రవాహనాలు, ఆటోలు వెళ్తుంటాయి. వర్షం వచ్చిందంటే చాలు ఈ దారి బురదమయమై వాహనాలు ఇరుక్కుపోతున్నాయి. ద్విచక్రవాహనదారులు జారి పడుతూ అనేక మంది గాయపడ్డారు. రాత్రి వేళల్లో ఈ రోడ్డుపై వెళ్లడానికి గ్రామస్థులు జంకుతున్నారు. అలాగే ధర్మాపురం రోడ్డు కూడా వర్షాలకు పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డు అంత గుంతలు ఏర్పడి వర్షపు నీటితో నిండి పోయి ఉండడంతో.. ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కర్నూలుకు వెళ్లే 44వ జాతీయ రహదారి నుంచి మూడు కిలో మీటర్ల దూరంలో ధర్మాపురం గ్రామం ఉంది. 15 సంవత్సరాల క్రితం ఈ గ్రామానికి వేసిన బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిని.. కంకర తేలి.. గుంతలు పడ్డాయి. పాలకులు, అధికారులు స్పందించి ఈ రోడ్డును బాగు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.


బురదమయమైన తొండపాడు-గొందిపల్లి రోడ్డు

నేటి ప్రముఖులు


పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

శంకర్ దయాళ్ శర్మ (జయంతి)



దేశ తొమ్మిదో రాష్ట్రపతిగా వ్యవహరించిన శంకర్ దయాళ్ శర్మ 1918 ఆగస్టు 19న మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో జన్మించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, పండితుడు. 1987 నుంచి 1992 వరకు ఉపరాష్ట్రపతిగాను, 1992 నుంచి 1997 వరకు రాష్ట్రపతిగాను వ్యవహరించారు. అంతకు పూర్వం మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా, విద్యాశాఖ, న్యాయశాఖ తదితర శాఖల్లో కేంద్ర మంత్రిగా, ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా వ్యవహరించారు. 1972-74 మధ్యన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులుగా కొనసాగారు. శృంగేరి పీఠం నుంచి రాష్ట్ర రత్నం, శ్రావణబెళగొళ నుంచి ధర్మ రత్నాకర తదితర గౌరవాలు అందుకున్నారు. 1999 డిసెంబరు 26న కన్నుమూశారు.

స్వామి సచ్చిదానంద సరస్వతి (వర్ధంతి)



ఆధ్యాత్మిక వేత్త, యోగా గురువుగా గుర్తింపు పొందిన స్వామి సచ్చిదానంద సరస్వతి 1914 డిసెంబరు 22న తమిళనాడు రాష్ట్రం కుడలోర్ ప్రాంతలో జన్మించారు. అసలు పేరు సీకే రామస్వామి గౌండర్. తత్వశాస్త్రం, ఆధ్యాత్మికతలపై పలు పుస్తకాలు రచించారు. ఆసియాఖండ వ్యాప్తంగా పర్యటించి యోగా, శాంతి, ఆరోగ్యంపై పలు ప్రసంగాలు చేశారు. 2002 ఆగస్టు 19న కన్నుమూశారు.

సుధా మూర్తి (పుట్టినరోజు)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత సుధామూర్తి 1950 ఆగస్టు 19న కర్ణాటక రాష్ట్రం హావేరి జిల్లా శిగ్గావ్‌లో జన్మించారు. ఇన్ఫోసిస్ సహసంస్థాపకుడు నారాయణ మూర్తి భార్య. సంఘ సేవకురాలు, రచయిత్రి, కంప్యూటర్ ఇంజనీర్‌గా జీవితాన్ని ప్రారంభించి ఇన్ఫోసిస్ ఫౌండేషన్, గేట్స్ ఫౌండేషన్ ద్వారా ప్రజారోగ్య విభాగాలలో కీలకపాత్రను పోషిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్‌లు అందించి పేద విద్యార్థులు కూడా ఉచితంగా కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పొందేలా ప్రోత్సహిస్తున్నారు. ఆమె రచించిన కన్నడ నవల 'డాలర్ సొసె' (డాలర్ కోడలు) ఆంగ్లంలో డాలర్ బహూగా అనువాదమైంది. తర్వాత ఈ నవల 2001లో జీ టీవీలో ధారావాహికగా ప్రసారమైంది. పద్మభూషణ్ వంటి ఉన్నత గౌరవం, 2023లో సాహిత్య అకాడమీ నుంచి బాలసాహిత్య పురస్కారం అందుకున్నారు.

బిల్ క్లింటన్ (పుట్టినరోజు)



అమెరికా దేశ అధ్యక్షుడిగా వ్యవహరించిన బిల్ క్లింటన్ 1946 ఆగస్టు 19న జన్మించారు. 42వ అధ్యక్షుడిగా 1993 నుంచి 2001 వరకు వ్యవహరించారు. పూర్తిపేరు విలియమ్ జెఫర్సన్ క్లింటన్. అమెరికా అధ్యక్షుడిగా ప్రజలలో మంచి ఆదరణ పొందారు. 2003, 2005లో గ్రామీ అవార్డు అందుకున్నారు. అధ్యక్ష పదవి అనంతరం ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడం, గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు.

సత్య నాదెళ్ల (పుట్టినరోజు)



సత్యనారాయణ నాదెళ్ళ అలియాస్ సత్య నాదెళ్ళ భారతీయ అమెరికన్ వ్యాపార నిర్వాహకుడు. 1967 ఆగస్టు 19న హైదరాబాద్‌లో జన్మించారు. స్టీవ్‌బామర్ తర్వాత మైక్రోసాఫ్ట్ సంస్థకు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. అంతకుముందు క్లౌడ్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ విభాగానికి ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. సీఈఓ బామర్ రిటైర్మెంట్ ప్రకటించిన తరుణంలో సత్య నాదెళ్ళ ప్రతిభకు అవకాశం దక్కింది. అంతర్జాతీయ స్థాయి సంస్థకు చైర్మన్ అండ్ సీఈఓగా మంచి పేరు పొందారు. 2022లో పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు. జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

యాదవ సముదాయ భవనానికి గ్రాంటు



కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, భక్తులు

బంగారుపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పట్టణానికి అనుబంధమైన కారహళ్ళి గ్రామపంచాయతీ సర్వే 98లో రూ.4కోట్ల విలువైన స్థలాన్ని, గ్రాంటును యాదవ సముదాయ శ్రీకృష్ణ భవన నిర్మాణానికి మంజూరు చేసినట్టు కర్ణాటక నగర మౌలిక సదుపాయాల అభివృద్ధి ఫైనాన్స్ కమిషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి తెలిపారు. పట్టణంలోని కువెంపు సర్కిల్‌లో జాతీయ పండుగల ఆచరణ సమితి, శ్రీకృష్ణ క్షేమాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి ప్రారంభించి మాట్లాడారు. దుష్ట సంహారం ద్వారా ధర్మ రక్షణతో సమాజంలో ధార్మిక సమతుల్యతను భగవాన్ శ్రీకృష్ణుడు ఆచరించి చూపారన్నారు. బాల్యంలో శ్రీకృష్ణుడు అల్లరిగా ఉన్నప్పటికీ బుద్ధిమంతుడని, దుష్టుడైన మేనమామ కంసుడిని సంహరించి ధర్మరక్షణకు పాటుపడ్డారన్నారు. యాదవసంఘం ముఖ్యులు మేస్త్రీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంతవరకు 13 మంది ఎమ్మెల్యేలను చూశానని, ఎవరూ యాదవ సముదాయ అభివృద్ధికి పాటుపడలేదని అయితే ఎమ్మెల్యే నారాయణస్వామి మాత్రం భవన నిర్మాణానికి స్థలం కేటాయించినా పలు కారణాలతో ఇంకా పనులు ప్రారంభం కాలేదన్నారు. అందరి సహకారంతో మరో పదిరోజుల్లో భూమిపూజ చేసి ఏడాదిలోగా భవ్యమైన నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు గోవింద, తహసీల్దార్ గాయత్రి, కారహళ్ళి గ్రామపంచాయతీ అధ్యక్షుడు శ్రీనివాస్, హందుకుళ వీఎస్ఎస్ఎన్ అధ్యక్షుడు హరీశ్, కృష్ణగౌడ, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

కలాసిపాళ్యలో అడుగు పెట్టడమే సవాల్

బెంగళూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఐటీ నగరిగా పేరొందేందుకు ముందుగానే నగరంలో ఉండే రెండు బస్టాండ్లలో అత్యంత కీలకమైనది కలాసిపాళ్య. నగరం నుంచి రోజూ వందలాది ప్రైవేట్ బస్సులు, అంతకుమించి బీఎంటీసీ బస్సులకు కేంద్రంగా ఉండే కలాసిపాళ్య బస్టాండ్‌లో అడుగు పెట్టాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. కలాసిపాళ్యకు వెళ్తే శుభ్రంగా ఎవరూ బయట పడలేరు. చెరువును తలపించేలా ప్రతిచోటా గుంతలు ఉన్నాయి. ఇక్కడే మార్కెట్, బస్టాండ్ ఉండడంతో నిత్యం వేలాదిమంది ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం మాత్రం నిధులకు కొదవ లేదని కోట్లు కొలదీ గ్రాంట్లు ఇస్తున్నామని చెప్పుకొంటోంది. నగరానికి పురాతనమైన బస్టాండ్ కలాసిపాళ్యలో అధ్వాన్నపరిస్థితిని మంత్రులు, ఎమ్మెల్యేలు పరిశీలిస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇటీవలి వరుస వర్షాలతో పలు చోట్ల రోడ్లు గుంతలమయంగా మారుతున్నాయి. బాగు చేయాలని కోరుతున్నారు.



కలాసిపాళ్య చుట్టుపక్కల ఇలా...



గుంతలమయమైన రోడ్డు దుస్థితి

వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ముళబాగిలు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని భైరకూరు హోబళి ముదిగెరె మజరా గడ్డూరు గ్రామపంచాయతీ పరిధిలోని దొడ్డగొల్లహళ్ళి, చిక్కగొల్లహళ్ళి గ్రామాల మధ్య కొలువైన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవం, కృష్ణాష్టమిని పురస్కరించుకుని విశేష పూజలు జరిగాయి. సుప్రభాతసేవన వేద పారాయణ, దివ్యప్రబంధ, నిత్యారాధన, నిత్యహోమం, బలిప్రదాన, ధ్వజారోహణ, వార్షిక మహా కుంభాభిషేకం, మూలవిరాట్టుకు విశేషపుష్పాలంకరణ జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టు విద్వాంసులచే అన్నమయ్య కీర్తనలు, హరికథ కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. ప్రసాద పంపిణీ, అన్నదానం సాగింది. రాజేశ్వరి హెచ్ఎన్ ప్రభాకరరెడ్డి, తిరుపతికి చెందిన మునేశ్వరరెడ్డి ఉమా దంపతుల ఆధ్వర్యం కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ట్రస్టుకు చెందిన ధర్మకర్తలు ప్రభాకరరెడ్డి, మాజీ మంత్రి నాగేశ్, ఇన్ఫోసిస్ కాంట్రాక్టర్ రమేశ్‌రెడ్డి, రిటైర్డు హెచ్ఎం మధుసూదన్ పెద్దసంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



మైండ్ యువర్ ఫిట్‌నెస్ సంస్థ పదాధికారులు

దొమ్మసంద్ర, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో ఉత్తమ ఆరోగ్యం సాధ్యమని మైండ్ యువర్ ఫిట్‌నెస్ సంస్థ వినుతా అభిప్రాయపడ్డారు. ముత్తానల్లూరు గ్రామంలోని లక్ష్మీ వేంకటరమణస్వామి ఆలయ ఆవరణలో ఫిట్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహార జాగృతి కార్యక్రమం నిర్వహించారు. ఇటీవలి కాలంలో మనం తినే ఆహారంలో పౌష్టికాంశాలు తక్కువగా ఉంటున్నాయని, మరోవైపు వాతావరణ కాలుష్యం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. మనం తీసుకునే ఆహారంలో ప్రొటీన్, మినరల్స్ ప్రమాణంపై అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ మన పూర్వీకుల ఆహారపు అలవాట్లు నేటి తరంవారు అమలు చేయడంలేదని తద్వారా జీవన ప్రమాణం తగ్గుతోందని అభిప్రాయపడ్డారు. ఇకనైనా మంచి పౌష్టికాహారపు అలవాట్లతో చక్కటి ఆరోగ్యం సాధ్యమన్నారు. కార్యక్రమంలో మైండ్ యువర్ ఫిట్‌నెస్ సంస్థ ముఖ్యులు అంజన్ గోస్వామి, పదాధికారులు లీలా, రూపాలి, రుచి, పద్మనాభన్, ప్రియరాణి పాల్గొన్నారు.

ఘనంగా శనైశ్చరస్వామి పల్లకీ ఉత్సవం



పురవీధుల్లో స్వామివారి పల్లకీ ఉత్సవం

ముళబాగిలు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఖాద్రిపుర సర్కిల్‌లో కొలువైన శనైశ్చరస్వామి దేవాలయంలో 21వ వార్షిక పుష్పపల్లకీ ఉత్సవం వేలాదిమంది భక్తుల సమక్షంలో ఘనంగా జరిగింది. పురవీధులలో పల్లకీ ఉత్సవం సాగింది. ఉదయం రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, తైలాభిషేకం, నవగ్రహ పూజలు జరిగాయి. భక్తులు ఉపవాసంతో స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు వివిధ రకాలకు ప్రసాద వినియోగం పంపిణీ చేశారు. దేవాలయ సంస్థాపకుడు, ప్రధాన అర్చకుడు వీ సుదర్శన్ దీక్షిత్ నేతృత్వంలో పూజాకైంకర్యాలు జరిగాయి. రాష్ట్ర బయో ఇంధన మండలి మాజీ ఉపాధ్యక్షుడు జి రామలింగారెడ్డి, రాష్ట్ర ఓబీసీ విభాగం ఉపాధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ, కిసాన్‌ఖేత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాష్‌చంద్రగౌడ, నగరసభ సభ్యురాలు దివ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



బహుమతులతో విద్యార్థులు

శిడ్లఘట్ట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే రవికుమార్ సమకూరుస్తున్న నోటు పుస్తకాలను ఉత్తమరీతిలో సద్వినియోగం చేసుకున్నవారికి తగిన రీతిలో బహుమతులు అందచేసి అభినందించారు. ప్రభుత్వ హైస్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఎస్‌సీ బ్యాంకు డైరెక్టర్ దేవరాజ్ పాల్గొని విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందచేశారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



అలంకరణలో పరమేశ్వరుడు



ముద్దాపురం గ్రామంలో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



దొడ్డబసవేశ్వరుడు

కంప్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో శివుని ఆలయాలు ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం జలాభిషేకం, అమృతాభిషేకం, బిల్వార్చన, ఆకుపూజ తదితర పూజలు జరిపారు. కురుగోడులో దొడ్డబసవేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాడు జరిగిన బండే బసవేశ్వర, శివశరణ నీలమ్మ దేవి, గంగాస్థల ఊరేగింపు చేపట్టారు. తాలుకా నెంబర్ టెన్ ముద్దాపురం గ్రామంలో శ్రీ బండే బసవేశ్వర, శివశరణ, నీలమ్మ దేవి, గంగాస్థల ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. కురుగోడు పట్టణంలోని కొండపై ఉన్న నీలమ్మదేవి మందిరంలో ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆపై ఎమ్మిగనూరు, బల్లాపుర మీదుగా ప్రభు క్యాంపులోని ముద్దాపుర రోడ్డులోని బన్నిగిడ వద్ద ఉన్న బసవన్న ఆలయ సమీపంలో అమ్మవారిని పూజించారు. తరువాత శ్రీ బండే బసవేశ్వర, శివశంరణ, నీలమ్మ దేవి అన్ని శుభ వాయిద్యాలతో గంగేస్థల ఊరేగింపును ప్రారంభించి, గ్రామంలోని ప్రధాన రహదారుల గుండా ప్రయాణించి ఆలయంలో ముగించారు. ఈ ఊరేగింపులో పూలపల్లకి, వీరగాసే, సుమంగళియార కలశ, డొలు కుణిత, తాషాద్రమ్ములు, మంగళవాయిద్యాలు, వంటి వివిధ కళారూపాలను ప్రదర్శించారు. గంగేస్థల హిన్నాలే ఆలయంలో ప్రత్యేయకక పూజలు, అభిషేకం, మహామంగళహారతి సహా వివిధ ధార్మిక కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ బండే బసవేశ్వర, శివరణు, నీలమ్మదేవి సేవా సంఘం అధ్యక్షులు బాలే మల్లికార్జున, నాయకులు వీరయ్యస్వామిబసవరాజస్వామి, శరణప్ప తాత, విరుపాక్షయ్య, గారే సోమేష్, గారే బసవరాజు, వసంత్, ఎం బసవరాజు, సోమేశ్వర, జడే మహదేవప్ప, జీర్ మల్లప్ప, మన్నల్లి గంగాధర, ధనుంజయ స్వామి, కట్టే మహంతేష్, కట్టే సునీల్, విప్రద భీమేష్, బాలే వీరేష్, మల్లికార్జున, బీఎస్ శివమూర్తి, గ్రామ నాయకులు, మహిళలు, యువకులు, చుట్టుపక్కల భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా నిడిగల్ ఉత్సవాలు

పావగడ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రెండవ హంపిగా పేరుగాంచిన పావగడ తాలూకా నిడిగల్ ఉత్సవాలు శ్రావణ సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలకు నిడిగల్ వాల్మీకి పీఠాధిపతి సంజయ్ కుమార్‌స్వామీజీ ఉత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. ఎందరో రాజులు మహారాజులు పాలేగాళ్లు పరిపాలించిన ఈ ప్రాంతం చరిత్రపుటల్లో నిలిచిపోయిందన్నారు. పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు. రామతీర్థంగా పేరుగాంచిన కోనేటిలో భక్తులు సంప్రదాయంగా మునిగి తమ మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం ఉదయం నుంచి వర్షం కురువడంతో పలు సాంస్కృతిక కార్యక్రమాలకు అడ్డు తగిలినప్పటికీ వర్షంలోనే కార్యక్రమాలను నిర్వహించారు.

ఆర్డీటీ అభిమానుల ర్యాలీ

గోరంట్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించాలని కోరుతూ సంస్థ అభిమానులు, మహిళలు సోమవారం పట్టణంలో ర్యాలీ చేశారు. పలుగ్రామాల మహిళలు పట్టణ ప్రధాన రహదారిపై తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగించారు. పేదలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి ఆర్డీటీ ఎంతో కృషి చేస్తోందన్నారు. అలాంటి సంస్థకు కేంద్రం ప్రభుత్వం ఎఫ్‌సీఆర్ఏ నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. అనంతరం తహసీల్దార్ మారుతికి వినతి పత్రం అందించారు.

పోస్టర్ల విడుదల

హిందూపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధి నివారణకు అవగాహన కార్యక్రమం, పోస్టర్ల విడుదల పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించారు. ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ క్యాంపెయిన్ సౌజన్యంతో సోమవారం ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి, అధ్యాపకులు ధనలక్ష్మి, హిమబిందు, తిప్పేస్వామి, కుమార్, మంజుల పాల్గొన్నారు.

దుబాయ్ సమావేశంలో తాలూకా రైతు ప్రముఖులు



అణ్ణామలైతో లోకేశ్‌గౌడ తదితరులు

శిడ్లఘట్ట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం లోని పలు ప్రాంతాల అభివృద్ధికై సలహాలు పొందేందుకు దుబాయ్‌లోని అంబాసడర్ స్కూల్ సభాంగణంలో మీట్ అండ్ గ్రీట్ పేరిట ప్రత్యేక సమావేశంలో శిడ్లఘట్ట తాలూకాకు చెందిన ప్రముఖులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు. మేకలు, గొర్రెల అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బళువనహళ్ళి సీవీ లోకేశ్‌గౌడ, మాజీ ఐపీఎస్ అధికారి అణ్ణామలైతో భేటీ అయి పలు అంశాలు చర్చించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా విజయవంతంగా కొనసాగుతున్న అణ్ణామలై రాజకీయాల్లో మరింత రాణించాలని అభిలషించారు.

ఆకట్టుకున్న చిన్నారుల ఫ్యాషన్ షో



ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

బెంగళూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆస్ట్రల్ స్టార్ కిడ్స్, ఆస్ట్రల్ మమ్మి పేరిట జరిగిన ప్రదర్శనలో చిన్నారులు ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు. మైసూరు రోడ్డులోని గ్లోబల్ డివినిటీ మాల్‌లో ఆదివారం రాత్రి ఫ్యాషన్‌షో జరిగింది. ర్యాంప్‌పై తల్లీబిడ్డలు వాక్ చేశారు. జూనియర్ మిస్ ఆస్ట్రల్‌గా అద్వితి, ఫస్ట్ రన్నరప్‌గా బెళకు, సెకండ్ రన్నరప్‌గా ఆద్య నిలిచారు. జూని యర్ మిస్టర్ విభాగంలో సంప్రీత్, రాయ్, సంభ్రమ్ మఠద్‌లు నిలిచారు. మిసెస్ ఇండియా కర్ణాటక డైరెక్టర్ ప్రతిభా సౌన్షిమఠ పోటీలను పర్యవేక్షించారు.


భూ వివాదం... అన్నను హతమార్చిన తమ్ముడు



వెంకటాచలపతి (ఫైల్)

బంగారుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భూవివాదం నేపథ్యంలో అన్నను తమ్ముడు వేటకొడవలితో దారుణంగా హత్యచేసిన సంఘటన బూదికోటె పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. తాలూకాలోని రామాపుర గ్రామంలో ఉదయం 6.30గంటలకు గొర్రెలు మేపేందుకు వెళ్లిన అన్నను తమ్ముడు వేటకొడవలితో హతమార్చాడు. వెంకటాచలపతి (55)ను పక్కఇంట్లో ఉంటున్న తమ్ముడు మునిరాజు హత్యచేసిన అనంతరం పోలీసులకు ఫోన్ చేసి విషయం తెలిపాడు. కాగా అన్న చలపతికి భూమివాటా ఇవ్వడంలో అన్యాయం జరిగిందంటూ పలుమార్లు పంచాయితీలు సాగాయి. మరోవైపు కోర్టులో కేసు కొనసాగుతోంది. ఇటీవలే గ్రామపెద్దల సమక్షంలో 35 లక్షల రూపాయలు ఇచ్చేలా తీర్మానించారు. అయితే సోమవారం తెల్లవారుజామున గొర్రెలషెడ్‌కు వెళ్లి అన్నను తమ్ముడు మునిరాజు వెంబడించి వేటకొడవలితో హత్య చేశాడు. ఇంటినుంచి షెడ్‌కు చలపతి వెళ్లడం, తమ్ముడు మునిరాజు షెడ్‌కు వెళ్లిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డు అయ్యాయి. హతమార్చిన అనంతరం తమ్ముడు పోలీసులకు లొంగిపోయాడు. ఘటనా స్థలాన్ని ఎఫ్ఎస్ఎల్ బృందం, ఎస్పీ శివాంశు రజపుత్ పరిశీలించారు. బూదికోటె పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. చలపతి కుటుంబంలో విషాదం నెలకొంది.

కృష్ణానదికి పెరిగిన వరద



బసవసాగర నుంచి విడుదలవుతున్న నీరు


రాయచూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని నారాయణపూర్ బసవసాగర్ జలాశయానికి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతుంది. బసదవసారగ జలాశయానికి 1 లక్ష 5 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా 25 గేట్‌లను ఎత్తి అధికారులు వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో జిల్లాలోని కృష్ణనది తీర గ్రామాల ప్రజలను అధికారులు హెచ్చరించారు. కాగా బసవసాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 33.91 టీఎంసీలు కాగా ప్రస్తుతం 31.91 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు ప్రకటించారు.

'సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

మడకశిర రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కదిరేపల్లి పీహెచ్‌సీ వైద్యుడు నరేష్ కుమార్ సూచించారు. టీడీ పల్లి గ్రామంలో జ్వరాలతో బాధ పడుతున్న రోగులను ఆయన పరిశీలించి వైద్యసేవలు అందించారు. ఆయన మాట్లాడుతూ 10 రోజులగా వర్షాలు కురుస్తుండడంతో రోగాలు వ్యాపించే అవకాశం ఉందన్నారు. చాల మంది దగ్గ, జలుబు, జర్వాలతో పీహెచ్‌సీకి వస్తున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కువగా నీరు నిలబడకుండా చూసుకోవాలన్నారు.

'పరిహారం ఇప్పించి.. ఆదుకోండి'

హిందూపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తూమకుంట పారిశ్రామికవాడలోని మీనాక్షి స్టీల్ పరిశ్రమలో జూన్10న బీహార్‌కు చెందిన జిబ్లాన్ యాదవ్ మృతిచెందాడు. ఆ కుటుంబానికి రూ.7.5లక్షలు చెల్లించారు. మిగిలిన మొత్తాన్ని ఇవ్వలేదు. వెంటనే బాధిత కుటుంబానికి మిగిలిన సొమ్ము అందించాలని పారిశ్రామికవాడ కార్మిక సంఘం అధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కార్మిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులతో కలిసి కార్మికశాఖ అధికారులకు వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ నాయకులు వినోద్, మారుతిరెడ్డి, నమీవుల్లా పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.16	1,623.85
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	64,081	44,038
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	86,631	86,310
నీటి నిల్వ (టీఎంసీలు)	77.01	72.79

13న జాతీయ లోక్ అదాలత్

● న్యాయాధికారి రాజశ్ హొసమనె



బళ్లారి సిటీ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ,స్టేట్ లీగల్‌సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెప్టెంబరు 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. సోమవారం నగరంలోని తాళూరు రోడ్డు కొత్త జిల్లా కోర్టు సముదాయంలో సివిల్ న్యాయాధికారి రాజశ్ హొసమనె విలేకరులతో మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా ప్రజలు తమ ప్రీ-లిటిగేషన్, కన్సిలియేటబుల్ క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద పరిహార ట్రిబ్యునల్ కేసులు, వైవాహిక కుటుంబ కేసులు, సివిల్ కేసులు ఇతర కేసులను త్వరగా పరిష్కరించుకోవచ్చన్నారు. బాధితులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెగా లోక్ అదాలత్‌కు సంబంధించిన సన్నాహక సమావేశాలు ప్రతి రోజు అన్ని కోర్టుల్లో జరుగుతున్నాయని, మరిన్ని వివరాలకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీని లేదా 08392-278077 నంబర్‌కు కాల్ చేసి, హెల్ప్‌లైన్ నంబర్ 15100కు కాల్ చేయవచ్చని పేర్కొన్నారు.

నలుగురిపై నక్క దాడి

● బంధించిన అటవీ అధికారులు



బోనులో నక్క

రాయచూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీరామ నగర్ పరిసరాల్లో సోమవారం ఉదయం బాలిక అక్కనాగమ్మతోపాటు మరో నలుగురు వ్యక్తులు రంగణ్ణ, మంజునాథ్, పూజాల పై నక్క ఆకస్మికంగా దాడి చేసింది. ఆహారం కోసం వెతుకుతూ నగరంలోకి ప్రవేశించి ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. పరిసరాల్లో ఆడుకుంటున్న బాలిక పై నక్క దాడి చేస్తు పక్కనే ఉన్న వ్యక్తుల పై కూడా దాడికి దిగింది. ఈ దాడిలో గాయపడిన నలుగురిని స్థానికులు చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగి నక్కను నిర్బంధించారు. కొంత మంది నక్కకు పిచ్చి పట్టి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తుండగా అటవి శాఖ అధికారులు నాల్గు రోజుల పాటు పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ఉంచుకుని తరలిస్తామని తెలిపారు.

హోం మంత్రి క్షమాపణ చెప్పాలి

పావగడ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర హోంమంత్రి జి.పరమేశ్వర్ యావత్ జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని ఆ సంఘం నాయకులు సోమవారం డిమాండ్ చేశారు. హోంమంత్రి తుమకూరు నగరంలో జర్నలిస్టులు లేనిపోనివి రాసి ప్రభుత్వాలకు చెడ్డపేరు తెస్తున్నారని, ఏదన్నా రాయాలంటే తమ దృష్టికి తీసుకురావాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పదివేల బైక్‌లతో ర్యాలీ



ర్యాలీగా వెళ్తున్న హిందూ జాగరణ సభ్యులు



వేదికపై మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి

బళ్లారి సిటీ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): బళ్లారిలో సోమవారం హనుమాన్ భక్తులు, హిందూజాగరణ వేదిక, ఆర్‌ఎస్‌ఎస్ తదితర హిందూ సంఘాల ఆధ్వర్యంలో పదివేలకుపైగా బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. నగరంలోని కూల్‌కార్నర్, రాయల్ సర్కిల్,బెంగళూరురోడ్డు, బ్రూస్‌పేట పోలీస్‌స్టేషన్, మోతీ సర్కిల్, కౌల్‌బజార్, రేడియోపార్కు, ఎస్పీ సర్కిల్, దుర్గమ్మదేవాలయం మీదుగా బైక్ ర్యాలీ సాగింది. ముందుగా కూల్ కార్నర్ సర్కిల్లో హిందూ జాగృతి వేదికలో అనిల్‌నాయుడు మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి ,ప్రభు, తదితరులు మాట్లాడారు. హిందుత్వం అత్యంత పవిత్రమతమని, దాని ప్రాధాన్యం ఎన్నటికీ తగ్గదని అన్నారు. అనంతరం నగరంలో పెద్ద సంఖ్యలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టిభద్రత ఏర్పాట్లు చేశారు. ఈసందర్భంలో మాజీ ఎమ్మెల్యే సోమశేఖరరెడ్డి, బుడా మాజీ అద్యక్షుడు మారుతీ ప్రసాద్ , కేఎస్.దివాకర్, ఐనాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ సోమవార పూజలు



రామలింగేశ్వరస్వామి

బళ్లారి రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని పరమదేవనహళ్లి గ్రామంలో రామలింగేశ్వర ఆలయంలో శ్రావణ మాసం నాల్గవ సోమవారంసందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. స్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చారు.



కుమారస్వామి

కుమారస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

సండూరు తాలుకాలో ప్రఖ్యాతిగాంచిన సండూరు కుమారస్వామి దర్శనానికి శ్రావణ సోమవారం సందర్భంగా భక్తులు విశేషంగా తరలివచ్చారు. ఆలయం వద్దకు చేరుకోవడానికి కమిటీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ఆలయంలో నిత్యాన్నదానం కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కమిటీ పదాధికారులు తెలిపారు.



కుమారస్వామి ఆలయం వద్ద భక్తుల సందడి

తెప్పపైనే శ్మశానానికి..



తెప్పపై మృతదేహాన్ని తీసుకెళ్తున్న గ్రామస్థులు

కంప్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కంప్లి కోట వద్ద తుంగభద్ర నది ఉప్పొంగి పారుతుండంతో సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నది పక్కనే ఉన్న శ్మశానానికి వెళ్లాలన్నా తెప్పల మీదే ఆధారపడాల్సి వస్తోంది. ఆదివారం రాత్రి కంప్లి పట్టణానికి చెందిన రాజపుత్ర సమాజానికి చెందిన శంకర్‌సింగ్ మృతి చెందారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించడానికి గ్రామస్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కోట వద్ద నదిలో నీరు ఎక్కువగా వుండటంతో తెప్పలపైనే మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్లారు. యేటా నదికి ఎక్కువగా నీరు పోటెత్తడం వల్ల ఈ కష్టాలు తప్పవని స్థానికులు వాపోతున్నారు. నదికి నీరు ఎక్కువగా వచ్చిన ప్రతీసారి ఇవే కష్టాలు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యపై స్పందించి వంతెన నిర్మించాలని కోరుతున్నారు.



పార్కింగ్ స్థలంలో మురుగునీరు



ప్రధాన ద్వారం వద్ద బురదమయమైన రహదారి

బురదమయంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

బళ్లారిరూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణంలో పరిశుభ్రత లోపించింది. నిత్యం జనంతో రద్దీగా వుండే కార్యాలయం వద్ద ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో సోమవారం కార్యాలయానికి వచ్చిన వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆవరణంలో పార్కింగ్ స్థలాల వద్ద బురదమయంగా మారినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని కనీసం గ్రావెల్ కూడా వేయకుండా వదిలేశారని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న ప్రొఫెసర్లు

చారిత్రక ప్రదేశాలను సంరక్షించుకోవాలి

● హంపి విశ్వవిద్యాలయ వీసీ డీవీ పరమశివమూర్తి

బళ్లారి సిటీ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): చరిత్ర పూర్వ రాతప్రతులు, నాణేలు, స్మారక చిహ్నాలు, తాటి ఆకులు, అవశేషాలు, ఫైళ్ల నిర్వహణ లేకపోవడం వల్ల నాశనమవుతున్నాయని, వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందని హంపి కన్నడ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డీవీ పరమశివమూర్తి అన్నారు. విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం చరిత్ర, పురావస్తు అధ్యయన విభాగం, కర్ణాటక ఇతిహాస సహకారంతో నిర్వహించిన 'చారిత్రక వారసత్వాన్ని పరిరక్షించండి' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాతి యుగంలో నివసించిన తొలి మానవుల అవశేషాలు చాలా వరకు బళ్లారి జిల్లాలో ఉన్నాయన్నారు. ఆధునికత హడావిడిలో అరుదైన చారిత్రక ప్రదేశాలు విస్మరించడం తగదన్నారు. వీటిని కాపాడటం సంరక్షించడం మనందరి బాధ్యత అని అన్నారు. చారిత్రక వారసత్వాన్ని కాపాడంలో లెక్చరర్లు, విద్యార్థుల పాత్ర ముఖ్యమని విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎం.మునిరాజుఅన్నారు. హంపిలోని విరూపాక్ష ఆలయంతో సహా అనేక స్మారక చిహ్నాలకు చారిత్రాత్మకంగా ప్రత్యేక స్థానం ఉందన్నారు. చరిత్ర సృష్టించిన శిల్పులు, కళాకారులను నేటి తరానికి పరిచయం చేయాలన్నారు. విశ్వవిద్యాలయంలోని కళ, సామాజిక శాస్త్ర విభాగాల్లో పరిశోధనలను ప్రోత్సహిస్తామన్నారు. రాబోయే రోజుల్లో పర్యాటకం, చారిత్రక కట్టడాల అధ్యయనం కోసం హంపి విశ్వవిద్యాలయంతో కలిసి కొత్త కోర్సును ప్రారంభిస్తామన్నారు. 44ప్రపంచ వారసత్వ ప్రదేశాల్లో 4కర్ణాటకాలోనే ఉన్నాయని తుమకూరు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ కొట్రేశ్ అన్నారు. ఈసందర్భంగా సేవ్‌ఆర్టికల్ హిస్టారికల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. చరిత్ర మరియు పురావస్తు శాఖ అధిపతి తిప్పేస్వామి వేదికపై ఉన్నారు. వివిధ డీన్‌లు, పలు విభాగాల అధిపతులు, కోఆర్డినేటర్లు,ఉపాధ్యాయులు, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.

ఉధృతంగా తుంగభద్ర



కంప్లి కోటే తుంగభద్ర వంతెనను మూసేసిన అధికారులు

కంప్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయానికి వరద ఉధృతి పెరిగిపోయింది. సోమవారం జలాశయం నుంచి నదికి 26 గేట్లు ద్వారా 1,07,000 క్యూసెక్కుల నీరు బోర్డు అధికారులు విడుదల చేశారు. కాలవల్లో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండంతో కంప్లి కోటే తుంగభద్ర నది వంతెనపై బరువైన వాహనాలకు అధికారులు నిలిపివేశారు. కేవలం ద్విచక్రవాహనం ఆటోలు, కార్లకు మాత్రమే అవకాశం కల్పించారు. నాలుగు చుక్కలు బరువైన వాహనాలకు వంతెనపై బంద్ చేయడంతో బుక్కసాగర మీదుగా గంగావతికి చేరుకుంటున్నాయి. ప్రతిసారి నదికి నీరు పోటెత్తడం వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నదికి నీరు పోటెత్తడంతో నన్నాపురం వద్ద రైతన్నలు మోటార్లలోకి నీరు చేరడంతో మోటార్లు ధ్వంసమయ్యాయి. మోటార్లను విప్పి గట్టుకు చేరుస్తున్నారు. యేడాదికి మూడుసార్లు నదికి ఎక్కువగా నీరు పోటెత్తడం వల్ల మోటార్లకు నీరు చేరుకుని మోటార్లు ధ్వంసమై ఒక్కో మోటారు రూ.పది వేలతో రిపేరీ చేయించామని రైతులు తెలుపుతున్నారు. మొత్తానికి యేడాది వర్షపాతం ఎక్కువగా వుండటంతో పంటలకు తెగులు సోకే ప్రభావం కూడా వుందన్నారు. రైతుకి ఈసారి రైతుకు కష్టాలు ఎక్కువగా కలిగాయన్నారు.

అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజ

సిరుగుప్ప, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రూ.50 లక్షల వ్యయంతో అదనపు గదుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బీఎం నాగరాజు భూమిపూజ చేశారు. సోమవారం తాలుకాలోని భైరగ్రామదిన్నె గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మూడు అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కరిబసప్ప, యువ నాయకులు గణేష్, పవన్ కుమార్ దేశాయ్, గొరవర శ్రీనివాస, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రేశ్వరస్వామి రథోత్సవం

సిరుగుప్ప, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అంగరంగ వైభవంగా వీరభద్రేశ్వర స్వామి మహా రథోత్సవం జరిగింది. సిరుగుప్ప తాలుకాలోని ధరూరు గ్రామంలో చివరి సోమవారం పురస్కరించుకుని ఈ యేడాది స్వాముల వారికి మహారుద్రాభిషేకం తదితర అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం మహారథోత్సవం గ్రామ పురవీధుల్లో మహా రథోత్సవం జరిగింది. భక్తులు పూలు, పండ్లు విసిరి మొక్కుబడులు తీర్చుకున్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో కృష్ణాష్టమి వేడుకలు

కంప్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్నారులకు వేషభూషణలు చేపట్టి రాధా కృష్ణ గోపికలతో వేషాలతో చిన్నారులు అలరించారు. చిన్నారులు ఆటలతోను వేషభూషణలతో ఆకట్టుకోవడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తపరిచారు. కంప్లి పట్టణంలో 20వ వార్డు మారుతీనగర్ (సీపిరిదిన్నె) 2వ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, తల్లిదండ్రులు తమ పిల్లలకు శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా రాధాకృష్ణ వేషాలు ధరించారు. కేంద్రంలో పిల్లలు వేషభూషణలతో పూర్తిగా ఆకట్టుకున్నారు. అంగన్ వాడీ కేంద్రం ఉపాధ్యాయురాలు పుష్పలత కేంద్ర ఆవరణంలో పిల్లలకి ప్రత్యేక క్రీడా పోటీలు నిర్వహించారు. వేడుకలపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



మారుతీనగర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద చిన్నారులు, సిబ్బంది

హొసూరు జోన్



జాగృతిలో ప్రిన్సిపాల్, పోలీసులు

మాదకద్రవ్యాల దుష్ప్రభావంపై జాగృతి

హోసూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరిస్తూ మాదకద్రవ్యాల నివారణ కమిటీ, జాతీయసంక్షేమ సేవా ప్రాజెక్టు ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జాగృతి ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పాకియమణి అధ్యక్షత వహించగా మధుగిరి ఎస్సై పూర్ణిమా జెండా ఊపి ప్రారంభించారు. మాదకద్రవ్యాల నివారణ అవగాహన కమిటీ సమన్వయకర్త డాక్టర్ సరస్వతి, జాతీయ సంక్షేమ సేవా ప్రాజెక్టు అధికారి డాక్టర్ మోహనప్రియ, ఫిజిల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ మోహన్ అంధిర్యాస్ తదితరులు పాల్గొన్నాఉ.

పెచ్చులూడిన బస్టాండ్ పైకప్పు

రాయచూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సెంట్రల్ బస్‌స్టాండ్‌లో సోమవారం ఉదయం అకస్మాత్తుగా ప్రమాదం చోటు చేసుకుంది. బస్‌స్టాండ్ పై భాగంలో వర్షపు నీరు నిలిచి ఉండడం వల్ల ఒక్క సారిగా సిమెంట్ పై పెచ్చులు ఊడి పడడంతో ప్రయాణీకులు బిత్తరపోయారు. అదృష్టవషాత్తు ఆ సమయంలో ప్రయాణీకులెవ్వరు అక్కడ ఉన్న కుర్చీల పై లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కాగా ఈ దెబ్బతో ప్రయాణీకులు కుర్చీల కూర్చోవాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. దాదాపు 10 ఏళ్ల క్రితం నిర్మించిన బస్‌స్టాండ్ పైకప్పు అప్పుడే ప్రమాదకరంగా మారడాన్ని ప్రయాణీకులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు తక్షణం చొక్యం చేసుకుని మరమ్మత్తులు జరపాలని ప్రమాదం ఉన్న చోట ప్రయాణీకులు ఉండకుండా తగిన ముందుజాగ్రత చర్యలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ఊడి పడిన పైకప్పు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ప్రముఖులు

రాకెట్‌బాల్ పోటీల్లో రాణించిన సేలం జట్టు

హోసూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రాకెట్ బాల్ పోటీలలో బాలికల జట్టులో సేలం జట్టు, బాలుర జట్టులో తిరుచ్చి జట్టు గెలుపొందాయి. కృష్ణగిరి పశ్చిమ జిల్లా క్రీడా విభాగం జిల్లా అధ్యక్షుడు పీటర్ సత్యరాజ్ పోటీలకు సమన్వయం చేశారు. కృష్ణగిరి పశ్చిమజిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మురళీధరన్, మునిసిపల్ అధ్యక్షుడు త్యాగరాజన్ హోసూరులోని అందివాడి స్టేడియంలో పోటీలను ప్రారంభించారు. తిరుచ్చి, కరూర్, ధర్మపురి, కన్యాకుమారి, థేణి, విల్లుపురం, చెన్నై, కోయంబత్తూరు, మధురై సహా వివిధ జిల్లాలనుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. బాలికల విభాగంలో సేలం జట్టు, బాలుర విభాగంలో తిరుచ్చిజట్టు ప్రథమస్థానంలో నిలిచి ట్రోఫీని గెలుపొందాయి. విజేతజట్లను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా హోసూరు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు త్యాగరాజన్, కోశాధికారి వెంకటేశ్, ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్, కార్యదర్శి బాబు, హోసూరు నగర కౌన్సిల్ సభ్యులు భాగ్యలక్ష్మి, ఇంద్రాణి,గోవర్ధన్, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంకేలో చేరిక

హోసూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వచ్చే శాసనసభ ఎన్నికలకు అధికార పార్టీ సన్నద్ధం కావడంతో పార్టీని బూత్‌స్థాయిలో బలోపేతం చేసేందుకు కార్యకర్తల నమోదు, చేరిక కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తోంది. వేపనహళ్ళి నియోజకవర్గం శూలగిరి నార్త్ యూనియన్‌లోని కురుమ్ సప్తడి గ్రామంలో 50మందికిపైగా యువకులు డీఎంకేలో చేరారు. పార్టీ పశ్చిమ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యే మురుగన్‌లు ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. కొత్తగా చేరినవారిని పార్టీ కండువాతో స్వాగతించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు పెరిక్లై నగేశ్, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన యువకులతో ఎమ్మెల్యే ప్రకాశ్, నాయకులు